క్లుప్తంగా

ప్రముఖ వ్యాపారి చౌడారెడ్డి కన్నుమూత


చౌడారెడ్డి మృతదేహం

దర్శి: పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త, శంకర వస్త్రాలయం యజమాని, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్, శ్రీశైలంరెడ్డి సత్రం మాజీ వైస్ చైర్మన్‌గా పలు పదవులు చేసిన మేడగం చౌడారెడ్డి (75) గురువారం మృతి చెందారు. ఆయన స్వగ్రామం తూర్పు చౌటపాలెంలో ఆయన అంత్యక్రియలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

ఉపాధ్యాయినులకు క్రీడల పోటీలు ప్రారంభం


షార్ట్‌పుట్ విసురుతున్న హెచ్‌ఎం రమాదేవి

యర్రగొండపాలెం: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉపాధ్యాయినులకు క్రీడలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమాదేవి ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్రీడా కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయినులు, ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూ నాయక్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

బాప్టిస్ట్ చర్చి సభ్యుల సహాయక చర్యలు


సహాయక చర్యలకు వెళ్లిన చర్చి సభ్యులు

కురిచేడు: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక తెలుగు బాప్టిస్టు చర్చి సభ్యులు బుధవారం సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఐదు రకాల పండ్లు, పాలు, నీరు, ఆహారాన్ని సమకూర్చుకుని ప్రత్యేక వాహనంలో వెళ్లి 600 కుటుంబాలకు బోటు సాయంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు బాప్టిస్టు చర్చి యూత్ సభ్యులు కంభంపాటి ఏసుదాసు, మాణిక్యరావు, బాబూరావు, సిద్రయ్య, దోరేపల్లి అజయ్‌కుమార్, మరియబాబు, రిచర్డ్‌సన్, సంఘ కాపరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నామినేషనా..? టెండర్ పెడతారా..?

- రూ.25 లక్షల పనులు నామినేషన్ పైనే ?
- ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అజ్ఞాత వ్యక్తి
- జాయింట్ కలెక్టర్ పిలిపించి టెండర్ ద్వారా మాత్రమే పనులు చేయాలని ఆదేశం
- నగర పంచాయతీ సమావేశంలో టెండర్లు పిలుస్తామని చెప్పిన కమిషనర్
- దొడ్డి దారిలో దోపిడీ చేసేందుకే నామినేషన్ పద్ధతి అంటున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు


దర్శి నగర పంచాయతీ కార్యాలయం

దర్శి: నగర పంచాయతీలో అభివృద్ధి పనులు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్నంత కాలం టెండర్ల ద్వారా మాత్రమే సాగాయి. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా ధనాన్ని దోపిడీ చేయడమే లక్ష్యంగా నామినేషన్ పద్ధతిలో పనులు చేయిస్తున్నారు. ఇటీవల రూ.2 లక్షల విలువ కూడా చేయని రెండు ఐరన్ బస్ షెల్టర్‌లు ఒక్కొక్కటి రూ.5 లక్షలు చొప్పున నామినేషన్ పద్ధతిలో ఇచ్చారు. టెండర్ పద్ధతిలో పనులు పిలిస్తే అందులో దోపిడీ చేసేందుకు అవకాశం ఉండదు. అదే నామినేషన్ పద్ధతిలో అయితే దోచుకుతిన్నా అడిగేవారు ఉండరు. నగర పంచాయతీలో సంపూర్ణ పారిశుధ్య పనులు చేసేందుకు రూ.25 లక్షల పనులు సైతం నామినేషన్ పద్ధతిలోనే విభజించి చేయించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇది ఆ పార్టీ నేతలకు కూడా మింగుడు పడలేదు. దీంతో నగర పంచాయతీలో జరుగుతున్న మోసాలను కలెక్టర్‌కు ఓ అజ్ఞాత వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీంతో జాయింట్ కలెక్టర్ పిలిపించి టెండర్ పద్ధతిలోనే పనులు చేయాలని ఆదేశించారు. దర్శి నగర పంచాయతీలో సంపూర్ణ పారిశుధ్య చర్యల్లో భాగంగా మురుగు నీటి కాలువల శుభ్రత కోసం రూ.25 లక్షలు కేటాయించారు. పనులు టెండర్ పద్ధతిలో కేటాయిస్తామని నగర పంచాయతీ సమావేశంలో కూడా ప్రకటించారు. పొక్లెయిన్‌తో గడియార స్తంభం సెంటర్ నుంచి నగరపంచాయతీ రోడ్డులోని మసీదు వరకు సుమారు 200 మీటర్లు కాలువల పై రాళ్లు తీయించి మురుగు తీశారు. ఆ తరువాత ఆ పనులు అలాగే నిలిచిపోయాయి. మరి కొన్ని రోజుల తరువాత పొదిలి రోడ్డులో కొన్ని చోట్ల, కురిచేడు రోడ్డులో కొన్ని చోట్ల మనుషులను పెట్టి కాలువలు తీయించారు. మరో రెండు గంటలు పొదిలి రోడ్డులోని కాటేడు వాగు వద్ద వరద నీరు బయటకు పోవడానికి పొక్లెయిన్‌తో పూడిక తీశారు. అంతకు మించి మరెక్కడా పనులు చేసిన దాఖలాలు లేవు. అయితే ఇటీవల టెండర్ పిలుస్తామన్న అధికారులు ఆ పని చేయలేదు. గుట్టు చప్పుడు కాకుండా నామినేషన్ పద్ధతిలో పనులు చేసినట్లు బిల్లులు చేసుకుంటున్నారన్న పుకార్లు షికార్లు చేస్తున్నాయి. టెండర్లు పిలుస్తామని చెప్పినప్పుడు అద్దంకి రోడ్డు, కురిచేడురోడ్డు, లంకోజనపల్లి రోడ్డు, తూర్పు చౌటపాలెం రోడ్డు, పొదిలి రోడ్డులలో తమ పొక్లెయిన్ వస్తుందని మీరు కాలువలపై ఉన్న బండలు, కాంక్రీట్ దిమ్మెలు తీయకపోతే మేమే తొలగిస్తామని ప్రతి దుకాణం వద్దకు వెళ్లి కాలువల పై ఉన్నరాళ్లను తీసి వేయాలని అందరికీ నగర పంచాయతీ సిబ్బందితో చెప్పించారు. కొందరు కాలువలు తీస్తారని రాళ్లు తీసి పెట్టుకుని ఎదురు చూస్తుండగా మరి కొందరు వాళ్లు వచ్చినప్పుడు తీద్దామని అలాగే ఎదురు చూస్తున్నారు. అయితే ఇప్పటి వరకు వాళ్లు వచ్చింది లేదు. కాలువలు తీసింది లేదు..ఈ విషయం పై నగర పంచాయతీ డీఈ ని వివరణ కోరగా ఎమర్జెన్సీ లో భాగంగా నామినేషన్ పద్ధతిలో ఇద్దామనుకున్న మాట వాస్తవమే అని చెప్పారు. కానీ మళ్లీ ఈ ప్రోక్యూర్ మెంట్ ద్వారా టెండర్లు పిలుస్తున్నామని అన్నారు. టెండర్ల ప్రక్రియ ద్వారానే రూ.25 లక్షల పనులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇప్పుడు నామినేషన్ పద్ధతిలో చేస్తారా..? లేక కలెక్టర్ ఆదేశాలు పాటిస్తారో వేచి చూడాల్సిందే.

నిధులు పక్కదారి పట్టిస్తే సహించేది లేదు


ఎంపీడీఓ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్‌లు

పెద్దారవీడు: ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు పక్కదారి పట్టిస్తే సహించేది లేదని మండలంలోని సర్పంచ్‌లు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ నిధులను పక్కదారి పట్టించకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు ఎంపీడీఓ రాజ్ కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలంటే పంచాయతీ తీర్మానం లేకుండా పనులు చేయించవద్దని, తాము చేయాల్సిన పనులు టీడీపీ నాయకుల లొత్తిళ్లకు భయపడి మండల స్థాయి అధికారులు పనులు చేయించడంతో పాటు బిల్లులు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న 15వ ఆర్థిక సంఘ నిధులను వై.పాలెం టీడీపీ ఇన్‌చార్జి ఏరిక్షన్‌బాబు అధికారుల ద్వారా బలవంతంగా నిలిపి వేయాలని చూస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ తీర్మానం లేకుండా గ్రామాల్లో టీడీపీ నాయకులు చెప్పినట్లు అధికారులు పనులు, వాటికి బిల్లులు చేస్తే తగిన ఫలితం అనుభవిస్తారని హెచ్చరించారు. మండలంలో మొత్తం 19 పంచాయతీలకు 15 మంది వైఎస్సార్ సీపీ సర్పంచులు ఉన్నారని, గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు రాకుండా గ్రామస్థాయి టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో టీడీపీ సర్పంచ్‌లకు రావాల్సిన నిధులను తమ నాయకులు ఎప్పుడు అడ్డుకోలేదని, ఇప్పుడు టీడీపీ నాయకులు అడ్డుకోవడం చాలా దారుణమన్నారు. టీడీపీ నాయకులు పెట్టే ఇబ్బందులకు మండలంలో మండల స్థాయి అధికారులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్‌లు చెబుతున్నారు. ఎంపీడీఓ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలేత్తకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేదుకు కృషి చేస్తానన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సర్పంచ్‌లు గుడ్డెపోగు రమేష్, అంగిరేకుల ఆదినారాయణ, పొందుగుల వెంకటరెడ్డి, మూల రమణారెడ్డి, పాలగిరి రామాంజనేయరెడ్డి, బెజవాడ అదాం ఉన్నారు.


మిరప నారు నాటుతున్న కూలీలు

ముమ్మరంగా మిరప నాట్లు

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో వారం రోజుల నుంచి రైతులు ముమ్మరంగా మిరప నాట్లు వేస్తున్నారు. వాతావరణం రైతన్నలకు కలిసి రావడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి మిరప నారు కొనుగోలు చేసుకుని వస్తున్నారు. ఎకరాకు తేజ రకం సుమారు రూ.10 వేల ధర ఉందని రైతులు తెలిపారు. వ్యవసాయ శాఖ సర్వే ప్రకారం మండలంలో సుమారు 700 హెక్టార్లలో రైతులు మిరప సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల నుంచి గుంటూరు మిర్చి యార్డులో మిరపకు నాణ్యమైన ధర పలకటంతో ఈ ఏడాది కూడా మంచి ధర వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కూలీలకు మంచి గిరాకీ ఉంది. వ్యవసాయ సిబ్బంది మిరప పంట ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. పెదన్నపాలెం, వెంకటాపురం, ఇండ్లచెరువు, రుద్రసముద్రం, మంగినపూడి, కొచ్చెర్లకోట, రామాపురం, పోలేపల్లి గ్రామాల్లో అధికంగా రైతులు మిరప పంటపై దృష్టి సారించారు. వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో రైతులకు వ్యవసాయ సూచన, సలహాలు అందిస్తున్నారు. తమ సిబ్బంది అన్ని వేళల్లో అందుబాటులో ఉంటారని, రైతులు వ్యవసాయ సమస్యలను తెలియజేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ కోరారు.

యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న మహిళా పోలీస్

దొనకొండ: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డ్రగ్స్, మత్తు పదార్థాలు సేవిస్తే ఇబ్బందులు ఎదుర్కొంటారని, దానికి దూరంగా ఉండాలని సచివాలయం మహిళా పోలీస్ శిరీషా విద్యార్థులకు సూచించారు. స్థానిక గౌతమీ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ నిరోధక కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భారతదేశం గొప్ప సంపద యువతేనని, మత్తు పదార్థాలక బానిసై ఆ గుర్తింపు కోల్పోవద్దన్నారు. ప్రిన్సిపాల్ రామయోగి మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసైతే విచక్షణ కోల్పోతారన్నారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. ప్రతి విద్యార్థి చెడు వ్యసనాలకు దూరంగా ఉంచుకుని శ్రద్ధగా చదివి మీ జీవితాలు తీర్చి దిద్దుకోవాలని, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తెచ్చి పెట్టాలని రామయోగి కోరారు. కళాశాల అడ్మిన్ నానీ, అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ ఉత్సవాల ముగింపు


పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

కురిచేడు: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని శ్రీకృష్ణ పీఠంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వాటిని బుధవారం ఘనంగా ముగించారు. పూజారులు నారాయణం వెంకటేశ్వర్లు, సుబ్బారావు శర్మలు భక్తులతో పూజలు చేయించారు. పూర్ణాహుతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారి ఉత్సవ మూర్తిని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహారంపై ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


పుల్లలచెరువు: సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకుంటే బాలింతలు, గర్భిణులు, శిశువులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని కోమరోలులో ర్యాలీ నిర్వహించి బాలింతలకు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకర శిశువు జననం తల్లి తీసుకునే పౌష్టికాహారంతోనే సాధ్యమన్నారు. గర్భిణులు తీసుకునే పౌష్టికాహారంతో కాన్పుల మరణాలు అరికట్టవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పని సరిగా భుజించాలని, ఇళ్లల్లో సైతం బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఏఎన్‌ఎం ముబీనా, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీకాంత్, కార్యకర్తలు శ్రీదేవి, రవణ, మల్లేశ్వరి, లక్ష్మీబాయ్, పోలమ్మ, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

తెగుళ్లతో రైతులు అప్రమత్తంగా ఉండాలి


పత్తి పైరును పరిశీలిస్తున్న ఏవో ఫరూక్


ముండ్లమూరు (దర్శి): రైతులు తెగుళ్లతో అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ అన్నారు. మండలంలోని నూజిళ్లపల్లి, శంకరాపురం గ్రామాల్లో బుధవారం వర్షాలకు దెబ్బతిన్న కంది, పత్తి పైరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంట సాగు చేసి 45 రోజులు అవుతుందన్నారు. వర్షాలతో రసం పీల్చు పురుగు, గులాబీరంగు పురుగు ఆశించే ప్రమాదం ఉందన్నారు. రసం పీల్చు పురుగు నివారణకు వేపనూనె 1500 పీపీఎం లీటరు నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. గులాబీరంగు పురుగు నివారణకు పురుగు ఉధృతి ఆధారంగా ఎకరానికి పది లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీఏఏలు ఆనంద్‌కుమార్, వైవీ కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పురుగుమందులు విచక్షణారహితంగా వాడొద్దు


వరి పంటను పరిశీలిస్తున్న ఏవో బాలకృష్ణ

దర్శి: రైతులు విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందులు వాడవద్దని మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని పాతకమూరు రైతు సేవా కేంద్రాన్ని, చెరువుకొమ్ముపాలెంలో వరి పంటలను పరిశీలించారు. రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ప్రతి రైతు తాము సాగు చేసిన పంటలను ఈ-పంట నమోదు చేయించుకోవాలని కోరారు. కౌలు భూములు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పంటసాగుదారు హక్కు పత్రాన్ని పొంది ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈఏవో దేవ శంకరమ్మ, రైతులు పాల్గొన్నారు.

పొలాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో శేషారెడ్డి

యర్రగొండపాలెం: వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశాలు ఉన్నాయని, పొలాల్లో నీరు నిల్వ చేరకుండా రైతులు చర్యలు తీసుకోవాలని ఏవో కేవీ శేషారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి కంది, మిరప, పత్తి పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటలు విత్తుకున్న పొలాల్లో నీరు బయటకు పారే విధంగా కాలువలు చేసుకోవాలన్నారు. పంటలపై సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఆయన కోరారు. రైతులు సాగు చేసిన ప్రతి పంటను సర్వే నంబర్ వారీగా పొలాల వద్దకు వెళ్లి పంట నమోదు చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. ఆయన వెంట ఏఈవో మాల్యాద్రిరెడ్డి, వీఏఏలు మీరావలి, రమేష్ ఉన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతి తప్పని సరి

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల పరిధిలో గణపతి నవరాత్రి మందిరాలు ఏర్పాటు చేసే నిర్వహకులు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని ఏఎస్ఐ సుబ్బమ్మ సూచించారు. ఆమె బుధవారం మాట్లాడుతూ ఉత్సవాలకు తీసుకోవాల్సిన నిబంధనలు వివరించారు. ఆయా మందిరాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు ఆధార్‌కార్డుల జిరాక్సులతో పాటు ఫోన్ నంబర్లు, చిరునామాలు అందజేయాల్సి ఉంటుందన్నారు. నవరాత్రి ఉత్సవాలు ఎన్ని రోజుల పాటు ఏర్పాటు చేస్తారో, ఆయా మందిరాలకు చెందిన నిర్వాహకులు పూర్తి వివరాలు తెలిజేయాలన్నారు. ఆదే విధంగా నిమజ్జనం తేదీని కూడా ముందుగా తెలియజేయాలని స్పష్టం చేశారు. నిమజ్జనం రోజు ఎవరు మద్యం సేవించరాదన్నారు. నిమజ్జనాన్ని రాత్రి 11 గంటల్లోపు పూర్తి చేయాలని తెలిపారు. ఎక్కడ నిమజ్జనం చేసేది కూడా తప్పని సరిగా తెలియజేయాల్సి ఉంటుందని పోలీసులకు సహకరించి ఉత్సవాలను ప్రశాంతవాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.

విత్తనాలను ఎమ్మార్పీకి మించి అమ్మితే చర్యలు


ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు (దర్శి): రైతుల అవసరాలను ఆసరగా తీసుకుని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను డీలర్లు ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని, చట్టంలోని సెక్షన్లు కచ్చితంగా అమలు చేయిస్తామని మండల వ్యవసాయాధికారి క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ బి. ప్రసాదరావు వ్యాపారులను హెచ్చరించారు. మండలంలోని తూర్పు గంగవరంలోని వెంకటసాయి రైతు డిపో, విత్తనాల షాపును ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాల సరుకు ఏఏ చోట్ల నుంచి వస్తుంది, ఎంత స్టాక్ ఉంది, ఎంత అమ్మింది, బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. రైతుల అవసరం, మార్కెట్లో డిమాండ్ ఉందని, ప్రభుత్వ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

కురిచేడు: మండలంలోని అలవలపాడులో బుధవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి 8 ఏళ్ల బాలుడిని గాయపరిచింది. వివరాలు.. గ్రామానికి చెందిన బాపట్ల అంకమరావు అనే బాలుడు తన ఇంటి వద్ద ఆడుకుంటుండగా పిచ్చి కుక్క దాడి చేసి కుడిచేయిని గాయపరిచింది. 108 సిబ్బందికి సమాచారం అందించటంతో వారు వచ్చి ప్రథమ చికిత్స చేసి వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పెద్దారవీడు: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ పి.అనిల్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. వినాయక ఉత్సవాల నేపథ్యంలో ఉత్సవ మండపాలు, పందిళ్లు ఏర్పాటు చేయడం కోసం సింగిల్ విండో క్లియరెన్స్ అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. గతంలో వినాయక మండపాల ఏర్పాటుకు అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ, పోలీసుల శాఖ నుంచి నిర భ్యంతర పత్రం తీసుకోవాల్సి వచ్చేదని, ఇందు కోసం ప్రజలు ఆయా శాఖల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, తాజాగా సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు ఇస్తామన్నారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని, అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.